# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 273 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 11 సెప్టెంబర్ 2026 | పేజీ : 4




విద్యారంగంలో 'స్వర్ణాల' పంట

- జర్నలిజంలో డబుల్ గోల్డ్ మెడల్ సాధించిన ప్రాన్సుత

4

## గణపతి ఉత్సవాలకు ఆహ్వానం

సికింద్రాబాద్ శ్రీ గణేష్ దేవాలయంలో నిర్వహించనున్న శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందింది. గురువారం శాసనసభలోని సీఎం ఛాంబర్‌లో దేవాదాయ శాఖ కమిషనర్, శ్రీ గణేష్ దేవాలయ కమిటీ అర్చకులు ముఖ్యమంత్రిని కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, విప్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు పలువురు శాసనసభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.





## పశుసంవర్ధక శాఖ లక్ష్యాలను
# సకాలంలో పూర్తి చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- భారత్ పశుధన్ పోర్టల్, వ్యాక్సినేషన్, కృత్రిమ గర్భధారణపై సమీక్ష

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నేషనల్ డిజిటల్ లైవ్‌స్టాక్ మిషన్ (NDLM), భారత్ పశుధన్ పోర్టల్, SASCI 2026-27, FMD వ్యాక్సినేషన్, కృత్రిమ గర్భధారణ (AI) తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భారత్ పశుధన్ పోర్టల్‌లో పశుపాలకుల ఆధార్, మొబైల్ నంబర్ల నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని 27 పశువైద్య సంస్థల మ్యాపింగ్‌ను వంద శాతం పూర్తి చేయడంపై అధికారులను అభినందించారు. అలాగే రోజువారీ లక్ష్యానికి అనుగుణంగా కృత్రిమ గర్భధారణలు (AI) చేపడుతూ, గర్భ నిర్ధారణ (PD) వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. జిల్లాలో FMD వ్యాక్సినేషన్ 94.94 శాతం పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన ముగించాలని చెప్పారు. VBG RAM G పథకం కింద మౌలిక వసతుల పనులను తగిన కార్యాచరణతో అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధక అధికారి మురళీధర్ రావు, మున్సిపల్ కమిషనర్లు రాజశేఖర్ రెడ్డి (జనగామ), రాధాకృష్ణ (ఘన్‌పూర్), పశుసంవర్ధక శాఖ ఏడీలు, వెటర్నరీ సర్జన్లు తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యాన, వ్యవసాయ శాఖలపై సమీక్ష

జిల్లాలో ఉద్యాన, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉద్యాన శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 2,000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యానికి గాను ఇప్పటివరకు 523 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తయిందని, వారం రోజుల్లో మరో 250 ఎకరాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీఏఓ అంబికా సోనీ, ఉద్యాన వన శాఖ అధికారి నర్సయ్య, అదనపు డీఆర్డీఓ సూరి తదితర అధికారులు పాల్గొన్నారు.


**wanted**

**విలేకరులు కావలెను**



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way



# ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**
- **కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి**

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ లో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలు (ఐలమ్మ మనుమరాలు) చిట్యాల శ్వేత, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలామణి ముఖ్య అతిథులుగా హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. అనంతరం చిట్యాల శ్వేత మాట్లాడుతూ... ఐలమ్మ పోరాట చరిత్ర అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని, మహిళలంతా ఆమెను ఆదర్శంగా తీసుకుని తమ హక్కుల కోసం ధైర్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ చిలువేరు అభి గౌడ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం



జిల్లా అధ్యక్షులు మైలారం వెంకటేశ్వరులు, అధ్యక్షులు కొలిపాక నరసింహులు, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు ఎదునూరి మదార్, ఏఎంసీ చైర్మన్ శివరాజ్ యాదవ్, సీనియర్ పాత్రికేయులు కన్నా పరశురాములు, దిశ మెంబర్ జనగామ బక్క శ్రీనివాస్, బీసీ కుల సంఘాల నాయకులు, సభ్యులు, ఐడీఓసీ సిబ్బంది, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మకు రజక సంఘం ఘన నివాళి

**జడ్చర్ల, మన చౌరాస్తా :** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా జడ్చర్ల పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం జాతీయ అధ్యక్షుడు నడిమింటి శ్రీనివాస్, బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ... నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం, మహిళల హక్కుల కోసం ఆమె చూపిన పోరాట స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, రాజు, శేఖర్, శివ కుమార్, ప్రసాద్, నర్సిములు, లక్ష్మయ్య, బాలరాజ్, రమేష్, మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






## చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సర్వోదయ తెలంగాణ కోసం టీఆర్ఎస్ పోరాటం

**హైదరాబాద్, మన చౌరాస్తా :** దొరల పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితోనే సర్వోదయ తెలంగాణ కోసం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పోరాడుతుందని పార్టీ నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, నవీన్ ఆచారి అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భూమి, భుక్తి, విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం అందరికీ ఆదర్శమన్నారు. ఆమె స్ఫూర్తితోనే తమ పార్టీ అధినేత్రి కవిత ఆధ్వర్యంలో ప్రస్తుత ప్రభుత్వ అక్రమ పాలనపై, నయా హిట్లర్ తరహా విధానాలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎత్తరి మారన్న, ఆనందం, బొడ్డుపల్లి లింగం తదితరులు పాల్గొన్నారు.



## కాడాస్ట్రల్ రీసర్వే పనులను పూర్తి చేయాలి

- **అదనపు కలెక్టర్ బెన్షా లోమ్**
- **చౌడూర్ గ్రామంలో రీ-సర్వే పనుల ఆకస్మిక తనిఖీ**

**దేవరుప్పుల, మన చౌరాస్తా :** జిల్లాలో జరుగుతున్న కాడాస్ట్రల్ రీసర్వే పనులను నిర్దేశిత గడువులోగా అత్యంత ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం దేవరుప్పుల మండలం చౌడూర్ గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే ప్రక్రియను ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీపీఎస్ (DGPS) రోవర్ ద్వారా నిర్వహిస్తున్న సర్వే విధానాన్ని, సర్వే బృందాల రోజువారీ పనితీరును, విస్తీర్ణ నమోదు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ రికార్డులను శాస్త్రీయంగా, పారదర్శకంగా రూపొందించడానికి ఈ సర్వే ఎంతో కీలకమని, ఇందులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. పరిశీలన కార్యక్రమంలో డీఐ మహేందర్, ఎల్ఎస్ఎస్‌లు, ఇతర రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు.




## చాకలి ఐలమ్మకు ప్రజా సంఘాల ఘన నివాళి

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ చూపిన ధైర్యం, త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బూడిద గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య, జనగామ మండల అధ్యక్షుడు బాల్నే ఉమాపతి, కార్యదర్శి తాళ్లపల్లి అశోక్, దేవరుప్పుల మండల కార్యదర్శి ఉడుగుల ప్రభాకర్, బూడిద ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అక్రమ అరెస్టులు సిగ్గుచేటు

- **బీఆర్ఎస్వీ జనగామ జిల్లా అధ్యక్షుడు ప్రణీత్ రెడ్డి**



**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్రంలో పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం దారుణమని, ఎలాంటి ముట్టడి పిలుపు ఇవ్వకపోయినా వేకువజామున 6 గంటలకే ఇంటికి వచ్చి అరెస్టు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్వీ జనగామ జిల్లా అధ్యక్షుడు వంగ ప్రణీత్ రెడ్డి మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి అసెంబ్లీ ముట్టడికి సంబంధించి ఎలాంటి అధికారిక సమాచారం కానీ, పిలుపు కానీ లేదని స్పష్టం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా ప్రశ్నించే గొంతులను పోలీసుల బలంతో నొక్కేయాలని చూడడం ప్రజాస్వామ్య విరుద్ధమని, ప్రతిపక్ష నాయకులపై జరుగుతున్న ఈ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

# సర్పంచ్, ఉప సర్పంచులు సమన్వయంతో పనిచేయాలి

- ఉప సర్పంచుల చెక్ పవర్ తొలగింపు డిమాండ్‌ను వ్యతిరేకిస్తున్నాం..
- కలెక్టర్‌ను కలిసిన జనగామ ఉప సర్పంచుల ఫోరం



**జనగామ, మన చౌరాస్తా :** గ్రామాభివృద్ధి కోసం సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు సమిష్టిగా పనిచేయాలని, ఉప సర్పంచుల చెక్ పవర్‌ను తొలగించాలన్న డిమాండ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఉప సర్పంచుల ఫోరం జనగామ జిల్లా అధ్యక్షుడు పండుగ హరీష్ ముదిరాజ్ తెలిపారు. చెక్ పవర్ తొలగించాలని కొంతమంది సర్పంచులు వినతిపత్రం ఇవ్వడాన్ని నిరసిస్తూ గురువారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వాస్తవ పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా హరీష్ ముదిరాజ్ మాట్లాడుతూ... ఉప సర్పంచ్ కూడా ప్రజాప్రతినిధేనని, పారదర్శకత కోసం అధికారాలు కొనసాగాలన్నారు. పాలకవర్గం గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలే తప్ప చెక్ పవర్ తొలగించాలని కోరడం బాధాకరమన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, అభివృద్ధికే ప్రాధాన్యమని, అడ్డంకులు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కార్యదర్శులు పుప్పాల కర్ణాకర్, కిషన్ గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ రాజిరెడ్డి, మండల అధ్యక్షులు తిరుపతిరెడ్డి (జనగామ), మూల కిరణ్ గౌడ్ (నర్మెట్ట), చిలువేరు మహేందర్ (తరిగొప్పుల), ఉపాధ్యక్షుడు వెంకట రాజ్ గౌడ్, జిల్లా నాయకులు కొండబోయిన రాజు యాదవ్, అనిల్ కుమార్, పాపిరెడ్డి, నరేందర్, ఉడుతల రాజు, సంపత్ రెడ్డి, రవి, సంపత్, సందీప్, కళ్యాణ్ పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమానికి పెద్దపీట

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- ఆలేరు నియోజకవర్గంలో బస్సులను పునరుద్ధరించాలి
- అసెంబ్లీలో రవాణా సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే
- సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళల సంక్షేమానికి, ఆత్మగౌరవానికి పెద్దపీట వేసిందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం శాసనసభలో ఆయన ఆలేరు నియోజకవర్గం, యాదగిరిగుట్ట క్షేత్రానికి సంబంధించిన పలు రవాణా సమస్యలను లేవనెత్తారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వచ్చేవారి భద్రత కోసం బస్ స్టాండ్ ప్రాంతంలో సీసీటీవీ కెమెరాలు పెంచాలని, ఆలయానికి ఎలక్ట్రిక్ బస్సులతో పాటు యాదగిరిగుట్ట డిపోకు నూతన బస్సులు కేటాయించాలని కోరారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం నేపథ్యంలో రద్దీ పెరిగినందున గ్రామాలు, తండాలకు అదనపు బస్సులు నడపాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వంగపల్లి వద్ద వరంగల్ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేలా టికెట్ పాయింట్ ఏర్పాటు చేయాలని సభ దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే విజ్ఞప్తులపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. యాదగిరిగుట్ట డిపోకు కొత్త బస్సులు కేటాయిస్తామని, వంగపల్లి వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేలా టికెట్ పాయింట్ ఏర్పాటు చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగిస్తామని హామీ ఇచ్చారు.

# అర్ధరాత్రి విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులు దారుణం : బీఆర్‌ఎస్వీ



**జనగామ, మన చౌరాస్తా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడి భయంతో పోలీసులు అర్ధరాత్రి వేళ అక్రమ అరెస్టులకు పాల్పడడం దారుణమని బీఆర్‌ఎస్వీ నాయకులు మండిపడ్డారు. జనగామ జిల్లా బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు రావుల తిరుమల్ రెడ్డిని అర్ధరాత్రి 2 గంటలకు, మరొక నాయకుడు ఉల్లెంగుల సందీప్‌ను వేకువజామున 6 గంటలకు పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థుల నిరసన హక్కును అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. సమస్యలను పరిష్కరించకుండా ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని విమర్శించారు. నిర్బంధాలు, అరెస్టులతో విద్యార్థుల గొంతును అణచలేరని, హక్కుల సాధన కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



# చైర్‌పర్సన్‌పై ఆరోపణలు రాజకీయ కుట్రలో భాగమే

- కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి సిద్ధం శివకుమార్

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలామణి శ్రీనివాస్‌పై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయ కుట్రలో భాగమేనని కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి సిద్ధం శివకుమార్ ఆరోపించారు. సర్వసభ్య సమావేశంలో జరిగిన చర్చలను వక్రీకరించి, మీడియా ప్రచారం కోసమే ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారని విమర్శించారు. పదేళ్ల అధికారంలో దళితులు, మైనారిటీలను పట్టించుకోని బీఆర్‌ఎస్ నాయకులు, ఇప్పుడు అధికారం పోయాక సానుభూతి పొందేందుకు ఆ వర్గాల పేర్లతో రాజకీయాలు చేయడం హాస్యాస్పదమన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి, పారదర్శక పాలనను చూసి తట్టుకోలేకే కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే యత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చౌకబారు రాజకీయాలు, మీడియా స్టంట్లతో ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయలేరని, జనగామ ప్రజలు అభివృద్ధి పక్షానే ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.

# దళిత, మైనార్టీ కౌన్సిలర్లను అవమానించిన చైర్‌పర్సన్‌పై చర్యలు తీసుకోవాలి

- స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐకి కౌన్సిలర్ల ఫిర్యాదు




**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలామణి తమ పట్ల అనుచితంగా, వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ దళిత, మైనార్టీ కౌన్సిలర్లు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐకి ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు వెళ్లిన తమను గౌరవించకుండా అవమానకరంగా మాట్లాడారని కౌన్సిలర్లు పానుగంటి సువార్త, మంజుల, సాజిత్, ఫాతిమా సమద్ ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై సీడీఎంఏ, రాష్ట్ర మహిళా కమిషన్, ఎస్సీ/ఎస్టీ కమిషన్‌లకు కూడా ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బల్దే సిద్ధిలింగం, మల్లిగారి రాజు, తిప్పరపు విజయ్, ఉల్లెంగుల సందీప్, తిరుమల్ రెడ్డి, గుర్రం నాగరాజు, సలీమ్, గులామ్, ఇరుగు సిద్ధులు, జానీ, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

# దళితుల పేరుతో రాజకీయాలు వద్దు

- బీఆర్‌ఎస్ నేతలకు కౌన్సిలర్ మిద్దెపాక భాస్కర్ సూచన



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలామణిపై దళిత, మైనార్టీ కౌన్సిలర్లను అవమానించారంటూ బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న నిరాధార ఆరోపణలను 5వ వార్డు కౌన్సిలర్ మిద్దెపాక భాస్కర్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై చర్చలను రాజకీయ వివాదంగా మార్చి, దళితుల పేరుతో లబ్ధి పొందాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. దళితుడిగా తాను స్పష్టం చేస్తున్నానని, దళితుల ఆత్మగౌరవం కాంగ్రెస్‌కు బాధ్యత అని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధిని పక్కదారి పట్టించడానికే బీఆర్‌ఎస్ నేతలు ప్రెస్ మీట్లు పెట్టి లేని వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల కౌన్సిలర్లకు సమాన గౌరవమిస్తూ సామాజిక న్యాయం కోసం పనిచేస్తోందని, బీఆర్‌ఎస్ నాయకులు చౌకబారు రాజకీయాలు మానుకుని పట్టణాభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.




# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు బలోపేతం

**సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్**

**జనగామ, మన చౌరాస్తా :** వీర తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా జనగామ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. బాల్నే వెంకట మల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐలమ్మ పోరాడిన భూమి, భుక్తి, విముక్తి లక్ష్యాలు నేటికీ ప్రాసంగికమేనని, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, ఎండి అజారుద్దీన్, పుతుకునూరి ఉపేందర్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, పల్లెర్ల లలిత, నాయకులు గంగరబోయి మల్లేష్ రాజ్, మాదాసి సుధాకర్, సుగుణ, పాము కుంట్ల రేణుక, రమాదేవి, పాము బిక్షపతి, సిద్ధిరాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

శుక్రవారం, 11 సెప్టెంబర్ 2026

Mana Chourasta





# గురువు ఏ రంగంలో ఉన్నా పూజనీయుడే..

## జనగామ మున్సిపల్ చైర్ పర్సన్ బాలమణి

**జనగామ, మన చౌరాస్తా :** సమాజ ఉన్నతికి తోడ్పడే గురువు ఏ రంగంలో ఉన్నా పూజనీయుడే అని జనగామ మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి అన్నారు. లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి లయన్స్ భవన్ లో జరిగిన గురుపూజోత్సవ వేడుకలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ అధ్యక్షుడు వనమాల సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో 9 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో కాంచనపల్లి జిల్లా పరిషత్ పి జి హెచ్ ఎం. ఎనగందుల సత్యనారాయణ, ఏకశిలా పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు మహమ్మద్ సలీం, చందా మాధవి, శ్రీ అరబిందో స్కూల్ ఉపాధ్యాయుడు కనికరం లక్ష్మణ్ కుమార్, విశ్రాంత హెచ్ ఎం. ఎస్. జయలత రెడ్డి, తెలుగు పండిట్ పానుగంటి రామమూర్తి, ఇబ్రహీంపూర్ ఉపాధ్యాయురాలు బి. రమాదేవి,




కొర్రతండ ఉపాధ్యాయురాలు వలబోజు స్రవంతి, హక్యతండ కొడకండ్ల ఉపాధ్యాయురాలు జి. వన్య శ్రీ లకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ సభ్యులు గత మూడున్నర దశాబ్దాలుగా సమాజసేవ చేయడం అభినంద నీయమని అన్నారు. సమాజంలోని సేవా తత్పరులను గుర్తించి సత్కరించడం వారిని ప్రోత్సహించడం చాలా మంచి పని అని కొనియాడారు. గురువులను గౌరవించడం ప్రతి వ్యక్తి అలవర్చుకోవాలని ఆమె సూచించారు వారి ఆశీర్వాద బలమే మనకు శ్రీరామరక్ష అని ఆమె అన్నారు. ఈ సందర్భంగా లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వ జిల్లా గవర్నర్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కన్నా పరశురాములు మాట్లాడుతూ క్లబ్ సాధించిన విజయాలను గుర్తు చేస్తూ ప్రసంగించారు. విద్యా కమిటీ సభ్యులు లయన్ ఈ ప్రభాకర్ రెడ్డి, శ్రీభాష్యం రఘు మాట్లాడుతూ గురువు యొక్క గౌరవ ప్రస్థానం గురించి ప్రత్యేకంగా వివరించారు. కార్యక్రమంలో మెంబర్షిప్ జిల్లా కోఆర్డినేటర్ లయన్ ఏ బిక్షపతి రీజియన్ చైర్మన్ జైన రమేష్ జోన్ చైర్మన్ కన్నా శ్రీనివాసు జిల్లా సెక్రెటరీ పబ్బ చంద్రశేఖర్, మార్కెటింగ్ కోఆర్డినేటర్ క్రిష్ణ జీవన్ బజాజ్ తదితరులు ప్రసంగించారు. ఉపాధ్యాలు తమ స్పందనలో వృత్తి పరంగా తమ అనుభవాలను గుర్తు చేస్తూ తమ సేవలను గుర్తించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రేణుకుంట కృష్ణ, కోశాధికారి బి. వీరయ్య, నాయకులు అల్లాడి ప్రభాకర్, నాగబండి రవీందర్, డా. జి. సీతారాం, రామిని శ్రీనివాసులు, డా. పి. నాగేశ్వర్ రావు, ఏ. మహేశ్వర్ ఎల్. శంకర లింగం తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో 'స్వర్ణాల' పంట

- **జర్నలిజంలో డబుల్ గోల్డ్ మెడల్ సాధించిన ప్రాన్షుత**

**జనగామ, మన చౌరాస్తా :** అక్షరాన్నే ఆయుధంగా మార్చుకుని, విద్యాభ్యాసంలో మొదటి అడుగు నుంచే విజయాల బాటలో పయనిస్తూ హనుమకొండ కీర్తిని రాష్ట్రస్థాయిలో సగర్వంగా నిలిపారు దాసి ప్రాన్షుత. ఇటీవల వెలువడిన ఉస్మానియా యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం (PG) ఫలితాల్లో ఏకంగా 'డబుల్ గోల్డ్ మెడల్' సాధించి తన అసాధారణ ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షించారు.



### తొలి నుంచి టాపరే...

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో జన్మించిన ప్రాన్షుత, ప్రాథమిక విద్యను బెంగళూరు కేంద్రీయ విద్యాలయంలో అభ్యసించారు. అనంతరం వరంగల్ కేంద్రీయ విద్యాలయంలో 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకొని, 10వ తరగతితో పాటు ఇంటర్‌లోనూ టాపర్‌గా నిలిచారు. అనంతరం మహారాష్ట్రలోని బీఆర్ అంబేద్కర్ మరాఠ్వాడా యూనివర్సిటీ (BAMU) నుంచి డిగ్రీ పూర్తి చేసి యూనివర్సిటీ ప్రథమ ర్యాంక్ సాధించారు. ఆపై ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిజం పీజీ కోర్సులో చేరి, అత్యుత్తమ ప్రతిభతో డబుల్ గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు.

### దేశసేవ, బోధనల స్ఫూర్తి...

ప్రాన్షుత తండ్రి దాసి ప్రభాకర్ భారత వైమానిక దళంలో సేవలు అందించి, చారిత్రాత్మక కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నారు. ఆయన ప్రస్తుతం హనుమకొండలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తల్లి కల్పన పర్వతగిరి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్నారు. క్రమశిక్షణ కలిగిన తండ్రి, ఆదర్శవంతమైన తల్లి ప్రోత్సాహమే తన విజయాలకు మూలస్తంభాలని ప్రాన్షుత తెలిపారు. పట్టుదల, నిరంతర శ్రమ ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించిన ప్రాన్షుతను, ఆమె సాధించిన ఘన విజయం పట్ల పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు విశేషంగా అభినందించారు.





# పెద్దపహాడ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్

జనగామ రూరల్, మన చౌరాస్తా : జనగామ రూరల్ పరిధిలోని పెద్దపహాడ్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం మెగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేవైఎం జనగామ జిల్లా అధ్యక్షుడు ఎల్లబోయిన హరీష్ ముఖ్య అతిథిగా హాజరై క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ... నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతోనే ఈ ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంలో బిపి, షుగర్, కంటి పరీక్షలతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్న రోగులను ప్రత్యేక బస్సుల ద్వారా హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం (సెప్టెంబర్ 17) సందర్భంగా 'సేవా పఖ్వాడా' పేరుతో రాబోయే రోజుల్లో మండలం, జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన మరిన్ని మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దపహాడ్ గ్రామ బీజేపీ




నాయకులు, కార్యకర్తలు సాగర్, శ్రీకాంత్, వెంకటేష్, రాకేష్‌తో పాటు పలువురు గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికురాలు నాగమ్మకు మున్సిపల్ చైర్‌పర్సన్ బాలమణి నివాళి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా సేవలందించిన నంది నాగమ్మ మృతి చెందడంతో జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ ఆమె మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చైర్ పర్సన్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి , మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ ముఖ్య నాయకులు పాల్గొని నంది నాగమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**